క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



ఐనవోలు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బ్లాక్ (తాలుక) స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమైనట్లు జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ తెలిపారు. క్రీడలు మానసిక ఆనందం, ఉత్సాహానికి దోహదపడుతాయని అన్నారు. యువత, ముఖ్యంగా మహిళలు క్రీడల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వరంగల్‌కు చెందిన దీప్తి జీవంజికి అర్జున అవార్డు సాధించినట్లు తెలిపారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన నాయకులు రాజు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కుమార్, రమేశ్, దిలీప్, సందీప్, పీఈటీ పాల్గొన్నారు.

గూడ్స్ ట్రాలీల్లో ప్రయాణించొద్దు

శాయంపేట : వ్యవసాయ పనుల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే కూలీలు గూడ్స్ ట్రాలీల్లో ప్రయాణించొద్దని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. గూడ్స్ ట్రాలీలో వ్యవసాయ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న కూలీల ట్రాలీలను ఆపి కౌన్సిలింగ్ నిర్వహించారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణించడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వ్యవసాయ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే కూలీలు అధిక సంఖ్యలో గూడ్స్ వాహనాల్లో ప్రయాణిస్తున్నారని, అలా వెళ్లకూడదని, గతంలో ప్రమాదాల బారిన పడి చేతులు, కాళ్లు పోగొట్టుకున్నవారు ఉన్నారని, ఆయన అన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దామెర : దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్‌పై అప్రమత్తంగా ఉండాలని రెడ్ క్రాస్ చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 88 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా బీపీ, షుగర్ మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ కిషన్ రావు, డాక్టర్ తయార్ మసూద్, సిబ్బంది శివకుమార్, గాంగాధర్, సతీశ్, శ్రీకాంత్, నర్సింహాచారి, పోశాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ధర్మసాగర్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఉనికిచర్ల శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పైడిపల్లి గ్రామానికి చెందిన చలువాది గోపాల్‌రావు (46) ఈనెల 27న రాత్రి హైదరాబాద్ నుంచి కారులో పైడిపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఉనికిచర్ల శివారులోని ఓఆర్ఆర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకి చేరుకోగానే గోపాల్‌రావు నడుపుతున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌కు ఢీ కొట్టింది. ఆయన కారులోంచి బ్రిడ్జిపై నుంచి కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. 108లో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు పేర్కొన్నారు.

చికిత్స కోసం వచ్చి మృత్యువాత

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యచికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. శాయంపేటకు చెందిన పిక్కల శ్రీనివాస్(43) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగానికి చేరుకున్నాడు. కంప్యూటర్ కౌంటర్‌లో ఓపీ స్లిప్ తీసుకుని పక్కనే ఉన్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ వద్ద మంచినీరు తాగడానికి వెళ్లి కిందపడిపోయాడు. గుర్తించిన స్థానికులు, సెక్యూరిటీ సిబ్బంది చికిత్స నిమిత్తం ఆస్పత్రి అత్యవసర విభాగానికి తరలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటు రావడంతోనే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక

దామెర : ఎమ్మార్పీఎస్ దామెర గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సతీశ్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా దామెర సతీశ్, గౌరవ అధ్యక్షులుగా ప్రసాద్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా సందీప్‌ను ఎన్నుకున్నారు. నాయకులు వినిల్, కుమారస్వామి, భిక్షపతి పాల్గొన్నారు.

వ్యాయామం చేసేదెట్లా ?



నిరుపయోగంగా మారిన పరకాల ఓపెన్ జిమ్



విరిగిపోయిన జిమ్ పరికరాలు

- మరమ్మతుకు చేరిన ఓపెన్ జిమ్
- ఆరేళ్ల క్రితం అమరధామంలో ఏర్పాటు
- విరిగిన జిమ్ పరికరాలు
- దృష్టి సారించని అధికారులు

పరకాల : ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు ఆహారపు అలవాట్లతో పాటు ప్రతిరోజు కొంత సమయం వ్యాయామానికి కేటాయించాల్సిన అవసరం ఉంది. అందరి ఆరోగ్యంపై దృష్టి సారించిన అప్పటి ప్రభుత్వం.. లక్షలాది రుపాయాలు వెచ్చించి పట్టణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. కానీ జిమ్ మరమ్మతుకు చేరుకోవడంతో నిరుపయోగంగా మారింది. ఆరేళ్ల క్రితం పట్టణంలోని అమరధామం పార్క్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. మొదట పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించడంతో పురుషులతో పాటు మహిళలు తెల్లవారుజామున 5 నుంచి 7 గంటల లోపు వచ్చి వ్యాయామం చేసేవారు. కానీ కొంత కాలంగా ఓపెన్ జిమ్ పరికరాలు క్రమక్రమంగా విరిగిపోవడంతో మరమ్మతులు చేసేవారు కరువయ్యారు. దీంతో ఓపెన్ జిమ్‌కు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయి నిరుపయోగంగా మారిపోయింది. పంచాయతీలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఓపెన్ జిమ్ ప్రాంగణంలో మద్యం సీసాలు దర్శనిమిస్తుండటమే ఇందుకు సాక్ష్యమంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం లక్షలాది రుపాయాలు ఖర్చు చేసి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తే వాటి మరమ్మతులను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఓపెన్ జిమ్ ఉపయోగకరంగా ఉండేది



ఓపెన్ జిమ్ మాకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. నేడు ప్రైవేటు జిమ్‌కు వెళ్లాలంటే డబ్బుతో కూడుకున్న పని. ఓపెన్ జిమ్‌లో పరికరాలు విరిగిపోవడంతో వినియోగించుకోలేకపోతున్నాం. మున్సిపల్ అధికారులు తక్షణమే పరికరాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

\- షఫీయోద్దీన్, పరకాల

పెండింగ్ బిల్లులు చెల్లించి డీఏ ప్రకటించాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

కమలాపూర్ : ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని, డీఏలు ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆయన పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మే కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లించే విధంగా ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రాంబాబు, ఎంఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి విద్యాసాగర్, మండల అధ్యక్షుడు వీరబ్రహ్మేంద్రచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్వతరెడ్డి

ప్రాణ హాని ఉంది.. రక్షించండి

- పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

కమలాపూర్ : పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన భూముల్లో తాము ఇళ్లు నిర్మించుకుంటుంటే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి బెదిరిస్తూ, భయబ్రాంతులకు గురి చేస్తున్నాడని, తమను రక్షించి న్యాయం చేయాలని మండల కేంద్రంలోని బీసీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు పద్మశాలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని 895 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో కొన్నేళ్ల క్రితం 122 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందని, అందులో ఇళ్లు నిర్మించుకుంటుంటే ఓ ఎస్సీ కులస్తుడు నా భూములంటూ ఇబ్బందులకు గురి చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహిళలని కూడా చూడకుండా తమపై దురుసుగా ప్రవర్తిస్తూ కించపరుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అతని వేధింపులు, ఆగడాలు భరించలేక పోతున్నామని, అతనితో తమకు ప్రాణ భయం ఉందని ఆరోపించారు. తమను, తమ భూములను కాపాడి న్యాయం చేయాలని వేడుకున్నారు.



పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తున్న పద్మశాలీలు

ప్రజావేదికలో రూ.30,321 జరిమానా



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఐనవోలు : మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం జరిగిన సోషల్ ఆడిట్‌లో జిల్లా ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసరావు ఉపాధి హామీ పనుల అధికారులకు రూ.30,321 జరిమానా విధించారు. ఈనెల 17 నుంచి 27 వరకు, ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31 2024 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనులకు ఆయా గ్రామాల్లో ఆడిట్ బృందం అధికారులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజా వేదిక నిర్వహించగా ప్రిసైడింగ్ అధికారిగా అదనపు జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో కూలీలకు రూ.2,14,61,225, సామగ్రి ఖర్చుల కింద రూ.3,46,63,793 మొత్తం రూ.5,61,25,045 చెల్లించగా.. ప్రజా వేదికలో ప్రిసైడింగ్ అధికారి అన్ని పనులను పరిశీలించి పలువురు ఎఫ్ఏ, టీఏ, ఈసీ, ఏపీఈఆర్‌లకు రూ.30,321 జరిమానా విధించారు. రికార్డు అసిస్టెంట్‌లను రికార్డులు సరిగా నిర్వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సెక్షన్ అధికారి నరసింహారెడ్డి, ప్లాంటేషన్ సూపర్ వైజర్ శ్రీనివాస్, డీటీసీ శ్రీధర్, ఎస్‌బీఎం సాయి జ్ఞానేందర్, ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, మండల స్పెషల్ అధికారి అనురాధ, ఎస్ఆర్పీ రమేశ్, ఏపీఓ నక్క కుమారస్వామి, ఈసీ ప్రదీప్, రమేశ్, నీరజ, ఉదయ్‌కుమార్, నరేందర్ పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, ఆడిట్ బృందంతో పాటు వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

- డాక్టర్ దామోదర్

కమలాపూర్ : చదువుకు పేదరికం అడ్డు కాకూడదని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, ఉప్పల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య మానవాభివృద్ధికి చాలా ముఖ్యమని, గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహిస్తామని, ముఖ్యంగా బాలల హక్కులు, రక్షణ చట్టాలు, సహకార వ్యవస్థలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గత నెలలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంపత్‌రావు, హెచ్ఎం ఉమ, ఉపాధ్యాయులు రేవతి, సుమలత, విద్యార్థులతో పాటు తదితర పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దామోదర్

రైతు భరోసా డబ్బులు జమ

దామెర : మండల కేంద్రంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమచేసినట్లు మండల వ్యసాయ అధికారి అల్లె రాకేశ్ మంళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దామెర గ్రామంలో 762 మంది రైతులకు ఈ పంట కాలానికిగాను 86,55,915 రూపాయలు జమ అయినట్లు పేర్కొన్నారు. తమ ఖాతాల్లో డబ్బులు జమకావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా 108 మంది కూలీలకు గాను ఒక్కో కూలీకి రూ. 6,000 చొప్పున జమచేసినట్లు తెలిపారు. మొత్తం 6,48,000 రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు ఏపీఓ శారద పేర్కొన్నారు.

తక్కువ వడ్డీతో అధిక రుణాల మంజూరు



పరకాల: అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్న వరంగల్ జిల్లా సహకార బ్యాంక్ సేవలను ప్రజలు, రైతులు వినియోగించుకోవాలని మాదారం పీఏసీఎస్ చైర్మన్, ఓడీసీఎంఎస్ డైరెక్టర్ నల్లెల లింగమూర్తి కోరారు. కర్షక మిత్ర, దీర్ఘకాలిక రుణాలను లబ్ధిదారులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన కొత్తగా ప్రవేశపెట్టిన సహకార మిత్ర–2 డిపాజిట్ స్కీం 555 రోజులకు 8.5 వడ్డీ చెల్లించే స్కీం ద్వారా రూ.6లక్షల డిపాజిట్‌లు సేకరించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూయూడీసీసీ నోడల్ అధికారి, ఏజీఎం స్రవంతి, బీఎం శ్వేత, ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలి



కమలాపూర్ : కిసాన్ కార్డులు, పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి రాజిరెడ్డి సూచించారు. మండలంలోని శనిగరం రైతు వేదికలో మంగళవారం కిసాన్ కార్డులు, పంట బీమాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయం అనేక విభాగాల భాగస్వామ్యంతోనే సఫలీకృతమవుతుందని, ఇందులో పెట్టుబడి ప్రధాన విభాగమని, బ్యాంకు తోడ్పాటు రైతు సంక్షేమానికి సూత్రదారి అన్నారు. భారత ప్రభుత్వం, ఆర్‌బీఐ ఆదేశాలతో బ్యాంకులు కిసాన్ కార్డులు అందజేస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న కిసాన్ కార్డులు, బీమా పథకాలపై భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పింగిళి వేణుగోపాల్‌రెడ్డి, పీవీ సుబ్బారెడ్డి, మురళీధర్, జలందర్‌రెడ్డి, పాపిరెడ్డి, మోహన్‌రావు, వెంకట నర్సింహరెడ్డి, జగ్గారెడ్డి, చంద్రమౌళి, బుచ్చిరెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఏపీఓ ఇందిరకు సన్మానం

పరకాల : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డును అందుకున్న పరకాల మండల ఈజీఎస్ ఏపీఓ ఇందిరను ఎంపీడీఓ కార్యాయ అధికారులు, ఉద్యోగులు, ఈజీఎస్ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల నుంచి ఉత్తమ అధికారిగా ఏపీఓ ఇందిర అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కొనియాడారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీకాంత్, మొగిళితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవిని శాలువతో సన్మానించారు. సూపరింటెండెంట్ శైలశ్రీ, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు వద్దు



కమలాపూర్ : మండలంలోని గూడూరు గ్రామ పరిధిలోని 143 సర్వేనంబరు భూమిలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయొద్దంటూ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ గుండె బాబు, డిప్యూటీ తహసీల్దార్ శోభారాణి, పంచాయతీ కార్యదర్శి స్వప్నప్రియకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ భూములను పలు విద్యాసంస్థలకు కేటాయించారని, ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. సోలార్ ప్రాజెక్టు కోసం పరిశీలించిన స్థలంలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారని, గ్రామంలో క్రీడా మైదానం లేక యువకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మినీ స్టేడియం ఏర్పాటు చేయడంతో పాటు మిగులు ప్రభుత్వ భూముల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు.

బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

- యూత్ కాంగ్రెస్ నాయకుల డిమాండ్



పరకాల : సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

పరకాల : ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఉద్యమబాటను ఎంచుకొని, చివరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆడి, పాడి ప్రజలను ఉద్యమం వైపు తీసుకెళ్లిన ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను కించపర్చేలా మాట్లాడిన బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మంద శ్యామ్, తనుగుల సందీప్, సిలువేరు రాఘవ, పోలెపాక ప్రశాంత్, రమేశ్ పాల్గొన్నారు.

శాయంపేట : దివంగత ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుమన్, ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా నాయకుడు నాలికే ప్రతాప్ డిమాండ్ చేశారు. గద్దర్ తన జీవితాన్ని ప్రజా చైతన్యం కోసం త్యాగం చేశారని, గద్దర్ అంటేనే ప్రతి పేదవాడి గుండె చప్పుడని తెలిపారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలు చేసుకుంటూ ప్రజల్లో కుల, మత విద్వేషాలు రెచ్చకొడుతూ పరిపాలన చేయడం సిగ్గుచేటన్నారు. గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను బండి సంజయ్ వెనక్కి తీసుకుని క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు విజయప్రకాశ్, కార్యదర్శి నాలిక శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

దామెర : ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దండు రాజు తెలిపారు. మంద కృష్ణమాదిగ, ఈటెల రాజేందర్ నక్సలైట్లు కారా అని ప్రశ్నించారు. వాగ్గేయకారుడిగా, ప్రజాసమస్యలపై పోరాటంచేసిన గద్దర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులు శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ విక్రమ్

శాయంపేట : విద్యార్థినులు శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని వాగ్దేవి కళాశాల బృందం డిన్నర్ లైఫ్ సైన్స్ డాక్టర్ విక్రమ్, మహిళ సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం పౌష్టిక ఆహారం, ఆహార నియంత్రణ విభాగం వారి ఆధ్వర్యంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు యువతులు శక్తివంతులుగా ఎదిగేందుకు పోషణ విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గురుకుల విద్యార్థులకు అందించే రోజువారి పౌష్టికాహారాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్ రజినిని అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరి సభకు తరలిరావాలి

- కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

కమలాపూర్ : హనుమకొండలోని ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు తరలిరావాలని బీసీ నేత, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. బీసీ రాజకీయ యుద్ధభేరి సభ వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, బీసీల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తేవాలని, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా చెల్లించాలని, చేతి, కుల వృత్తులను పరిశ్రమలుగా గుర్తించడంతో పాటు తదితర డిమాండ్ల సాధనకు యుద్ధభేరి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బండారి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరిగౌడ్, కత్తి రమేశ్, ఎడ్ల వెంకటేశ్వర్లు, చందర్‌రావు, ప్రణయ్, శ్రీనివాస్, రమేశ్, బుట్టి శ్యాంయాదవ్, కుమారస్వామిగౌడ్, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, అరవింద్, చందర్ సింగ్ యాదవ్, రమేశ్, సదానందం పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సుందర్‌రాజ్‌యాదవ్

పశుగ్రాసం, వ్యవసాయ పనిముట్లు దగ్ధం

శాయంపేట : మండలంలోని ఆరెపల్లిలో వరిగడ్డి కట్టలు, రెండ్లు ఇళ్ల పాత కర్ర, వ్యవసాయ పనిముట్లు ప్రమాదవ శాత్తు దగ్ధం అయ్యాయి. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్నా నర్సింగరావుకు చెందిన గడ్డికట్టలకు మంటలు అంటుకుని దగ్ధం అయ్యాయి. కాగా పక్కనే ఉన్న తిప్పారపు ప్రభాకర్‌కు చెందిన రెండ్లు ఇళ్ల పాత కర్ర, వ్యవసాయ పనిముట్లు, 300 గడ్డికట్టలు పూర్తిగా కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన చుట్టుపక్కలవారు మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా అదుపులోకి రాలేదు. అప్పటికే వ్యవసాయ పనిముట్లు, కలప పూర్తిగా దగ్ధమైంది. దీంతో 100కు డయల్ చేయగా పరకాలలోని ఫైర్ సిబ్బంది హుటాహుటిన చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీంతో దుర్నాల నర్సింగరావుకు రూ. 20వేల నష్టం వాటిల్లిందని, తిప్పారపు ప్రభాకర్‌కు రూ. 50వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



కమలాపూర్ : దేశరాజుపల్లిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి గ్రామంలోని అర్హులందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంతో పాటు రైతు భరోసా డబ్బులు జమ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క, మంత్రులు నాగేశ్వర్‌రావు, ప్రభాకర్‌గౌడ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి, డైరెక్టర్ సముద్రాల కృష పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎల్కతుర్తి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో మంగళవారం దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, కార్తీక్, సురేశ్, మేకల రవి, చేరాలు, గౌర్ర మహేందర్, శనిగరం వెంకటేశ్, కొలుగూరి రాజు, కొమురయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.